
# లవ్-క్ష్యం

- ఎం.ఆర్.శేషాద్రి



ధర్మమనేది యుగయుగానికి మారుతూ ఇక కలియుగానికి వచ్చేటప్పటికి అధర్మంగానే నిలబడిపోయింది.

అ... నాది అనేది అ[ంతా] నాది అయిపోయింది.

స్వార్థమే ధర్మం.

తనను మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరము.


రామ్‌నామ్ జప్నా పరాయి మాల్ అప్నా

అంటే తనకి ఒక కన్ను పోయినా ఫర్వాలేదు ఎదుటి వాడికి మాత్రం రెండు కళ్లూ పోవాలి అనేదే క్లుప్తంగా కలియుగ ధర్మం.

అటువంటి తోవకు చెందినవాడే మన అప్పలాచారి
మానవ సేవయే మాధవసేవ. పన్నెండు మందిని కనిపారేసి, ఆ మానవ సేవ చేసినట్టుగా తృప్తిపడ్డాడు.
కానీ ఆ చీపర్ బై డజన్‌లో దేవుడే సగం మందిని లాగేసుకున్నాడు.
రిటైరు అయ్యే కాలానికి ఆయనకు ఆరుగురు మిగిలారు - అంతా ఆడవాళ్ళే.
వీళ్లకు చదువులు చెప్పించి, స్త్రీలుగా మార్చిదిద్దాడు.
చారికి కొడుకులు లేరు కాబట్టి ఆయన కంపెనీ 'చారి అండ్ కో [కొడుకులు] బదులు 'చారీ అండ్ కూ' [కూతుళ్ళు] అయింది.
ఆ 'కూ'లోని 'క్యూ'లో ప్రథమ వ్యక్తియే మన కథానాయకి.
పేరు లక్ష్మి. చదువులో సరస్వతి.
కార్యాచరణంలో శక్తి స్వరూపిణి - పార్వతి...
ఆల్ త్రీ... ఇన్...ఒన్...
చిన్నప్పట్నుంచీ చదువులో ఫస్టు... ఫస్టులో ఫస్టు... మన కథాకాలానికి పిహెచ్.డి. చేస్తూంది. చేస్తూండగా తన తోటి విద్యార్థి రావుతో సాన్నిహిత్యం ఏర్పడింది - 'లవ్' అని అనడానికి లేకపోయినా అతని గురించి తీక్షంగా ఆలోచించసాగింది.
ఆలోచించగా... చించగా అతనిలో ప్లస్సు పాయింట్సే ఎక్కువగా కనిపించాయి.
ఆ ప్లస్సు పాయింట్లు -
శ్రీమంత పుత్రుడు
ఏకైక పుత్రుడు
మంచివాడు
తెలివైన వాడు
అందగాడు గాకపోయినా కురూపి కాదు.
అతనిలో ఉన్న ఒకే ఒక మైనసు పాయింటు ... వాళ్లది తెలుగు సంప్రదాయం.. లక్ష్మి వాళ్లది తమిళ సంప్రదాయం.
తుది నిర్ణయంగా సంప్రదాయం అనే పదంలోని స్పష్టంగా కనిపిస్తున్న 'ఆదాయం' మాత్రమే ఉంచుకుని ఎవ్వరికీ అర్థంకాని ఆ మొత్తం సంప్రదాయాన్ని తోసివేయ నిశ్చయించింది - లక్ష్మి
ఫలితం
రావు, లక్ష్మి వివాహం చేసుకో నిశ్చయించారు.
అదే విషయాన్ని లక్ష్మి తండ్రితో సంప్రదిస్తే ఆయన రెచ్చిపోయి
"మన ఇంటా వాటా లేదన్నాడు.
కారణం -
"మనం తమిళులం. వాళ్ళు తెలుగువాళ్ళు... పొత్తు పొసగదు" అని తెలుగులోనే జవాబిచ్చాడు. వాళ్లింట్లో యెవ్వరికీ ఒక్క తమిళం ముక్క కూడా రాదు - అయినా ముసలాయన దృష్టిలో మాత్రం 'తాము తమిళులం' అనే భ్రమ.
ఇద్దరికీ వాగ్వివాదం జరిగిన తర్వాత లక్ష్మి కోపగించుకుని ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయి లేడీస్ హాస్టల్లో చేరిపోయింది.

మూడు నెలల తర్వాత....
చారికి ఒక బుక్ పోస్టు వచ్చింది.
అది ఒక వివాహ ఆహ్వాన పత్రిక...
'లక్ష్మి రావుల వివాహం.'
అది బుక్ పోస్టు అని తెలిసినా ఆశగా ఇంకేమైనా ఉత్తరా లున్నాయా అని చూస్తే.. నిరాశే ఎదురైంది.
అహం దెబ్బతినింది.
చిటపటలాడాడు.
కస్సు బుస్సు మన్నాడు.
తన నిస్సహాయతను తలచుకుని... ఆ షాకుని దిగమింగడం తప్పితే ఇంకేమి చేయలేకపోయాడు. మౌనంగా ఆ ఆహ్వాన పత్రికను పెళ్లాం 'అంబుజా'నికి ఇచ్చాడు.
ఆమె చదివింది. ఏమీ అనలేదు. నిర్లిప్తంగానే ఉండిపోయింది. ఆమె మాత్రం ఏం చేస్తుంది?
ఏమి చేయలేనప్పుడు... మౌనంగా భరించడమే ఉత్తమం అనే తత్త్వం ఆమెది.
ఆ ఇంట్లో అనిర్వచనీయమైన నిశ్శబ్ద వాతావరణం ఆవరించింది.
అది తుఫాను వీచే ముందు ప్రకృతి అలుముకున్న ప్రశాంతతా? లేక అనివార్య పరిస్థితులకు లొంగిపోయిన మనస్తత్త్వం వల్ల యేర్పడ్డ నిర్లిప్తతా?
ఇతమిత్థంగా తేల్చుకోలేక మిగతా పిల్లలు ఆ వాతావరణంలో భయభ్రాంతులై అలమటించిపోయారు.
అలాగే పది రోజులు గడిచాయి.
ఇంట్లో అవాంఛనీయమైన సంఘటనలు ఏమీ జరుగలేదు.
'హమ్మయ్య' అని పిల్లలు నిట్టూర్పు విడిచారు -
ఒక రోజు సాయంకాలం... చారి ఇంట్లోకి వస్తూ -
"ఏమేవ్... అంబుజం! అమ్మాయిని కోఠీలో చూశాను" అన్నాడు.
ఆమె ఆత్రంగా "చూశారా? బాగుందా? మన గురించి ఏమైనా అడిగిందా?" అని గభగభా మిషన్ గన్నులోంచి దూసుకువస్తున్న తూటాల లా ప్రశ్న పరంపరలు కురిపించింది.
పిల్లలు "నాన్నా! అక్కయ్యను చూశారా? మా కేమైనా ఇవ్వమని ఇచ్చిందా?"
ఎవరి గొడవలు వాళ్లవి.
మళ్లీ అంబుజమే అందుకుని... 'ఎక్కడ చూశారూ?'
"తాజ్‌మహల్ - హొటల్లో."
"అయితే మీరేమీ చెప్పక్కర్లేదు. రెండు బక్కెట్ల సాంబారుకు ఒక్క ప్లేటు వడను నంచుకుని.. ఆ రుచిని చప్పరిస్తూ.. ఆమె చెప్పిందల్లా విని... గంగిరెద్దులా తలూపేసి... పెళ్లికి ఒప్పేసుకుని వచ్చేసి ఉంటారు. అంతేనా?"
"కాదు."
"మరి?"
"మన మా పెళ్లికి పోవడంలేదు."
"పెళ్లి సమ్మతమే... కానీ పోవడంలేదు. అంతేనా."
"ఆమె పెళ్లి మన సమ్మతం మీద ఆధారపడలేదు. కాబట్టి దాని ప్రసక్తే లేదు. ఇక మిగిలినది... మన మా పెళ్లికి దూరబంధువుల్లా... హాజరు కావడమా లేదా అనే ప్రశ్న... ఆ పెళ్లిలో మనం తల్లితండ్రులుగా ఉండలేము. దూరబంధువుల్లా పోనూలేము. కాబట్టి మన మా పెళ్లికి పోకపోవడమే మర్యాద... ఇక దాని గురించి ప్రస్తావించక్కర్లేదు."
ప్రస్తావన అక్కడికి ముగిసింది.
కొద్ది రోజుల తర్వాత ఒకనాడు ఉదయం చారి పెళ్లాంతో... "అంబుజం! ఈ రోజు చక్కెర పొంగలి చేసి.. దేవుడికి నైవేద్యం పెట్టవే."
"ఈ రోజు! మన కేం పండుగ గిండుగ లేదే?" అని అంబుజం ఆశ్చర్యాన్ని వెలిబుచ్చింది.
"ఈ రోజు మనకు పండుగ గిండుగా లేకపోయినా మన అమ్మాయికి పెళ్లి రోజు. ఆ పెళ్లి మనకు ఇష్టమున్నా లేకపోయినా.... అమ్మాయి ఇష్టపడి చేసుకుంటున్న పెళ్లి. ఆమె జీవితంలో అడుగుపెడుతున్న తొలి రోజు. మలుపు తిరుగుతున్న రోజు. మూడుపూలూ ఆరు కాయలూ అయ్యేదానికి దోహదం చేయనున్న తొలి రోజు. ఆమెకు అంతా శుభం కావాలనే కోరుతూ... ఉడుతా భక్తిగా దేవుని ప్రార్థిద్దాము."
కొంచెం ఆవేదనతోనే చారి అన్నాడు.
ఆ మాటల్లో ఒక వైపు ఆమె పెళ్లిని స్వయంగా చేయలేని నిస్సహాయత.. మరో వైపు త న్నెదిరించి ఆ నిస్సహాయతను వేలెత్తి చూపిస్తున్నట్టు తన దారిని తానే చూసుకున్న అమ్మాయి తెగింపు మీద ఉక్రోషం. ఆ ఉక్రోషాన్ని అణచివేస్తున్న కర్మ వైరాగ్యం... అంతా మిళితమై పెల్లుబికినాయి.

ఆ రోజు లక్ష్మిని తలచుకుంటూ అందరూ కాలాన్ని ఎలాగో గడిపారు.
పెళ్లయిన వారం రోజుల తర్వాత ఒక శుక్రవారంనాడు లక్ష్మి రావులు.. కూతురు అల్లుడు హోదాలో చారి ఇంటికి వచ్చారు. చారి ముభావంగా ఉన్నా. సమాధాన పడిపోయినట్టుగా కూతురూ అల్లుళ్లను ఆహ్వానించి.. చేయవలసిన మర్యాదలంతా తన శక్త్యానుసారం చేశాడు.



అందరూ సంబరంగా కాలం గడిపారు.

లక్ష్మి నాన్నకు పట్టు పంచ, కండువా... అమ్మకు పట్టుచీర జాకెట్టు వెండి కుంకుమ భరిణి, తాంబూలంలో పెట్టి సాష్టాంగ నమస్కారాలు చేసింది.

తల్లిదండ్రులు వాళ్లను ఆశీర్వదించారు.

వాళ్లందరి దగ్గర సెలవు తీసుకుంటూ లక్ష్మి తన చెల్లెళ్లందరికీ తలా ఒక బహుమతి ఇచ్చింది.

అందరికీ టాటా చెబుతూ 'వీసా' రాగానే అమెరికా వెళ్తున్నట్టూ, వెళ్లిన తర్వాత జాబు వ్రాసేటట్టు చెప్పింది.

మూడు నెలల తర్వాత -

చారికి ఒక జాబు వచ్చింది. అది లక్ష్మి దగ్గర నుండి. ఆ జాబుతో ఒక 25,000 రూపాయల డి.డి.

ఆ డబ్బుతో చారి సంతోషనగర్‌లో ఒక ప్లాటును కొన్నాడు. లక్ష్మి అప్పుడప్పుడు పంపిన డబ్బుతో ఒక ఇల్లు కట్టుకున్నాడు.

ఆ ఇంట్లోనే చారి ఇప్పుడు సంతోషంగా ఉంటూ...

"తెలివైన వాళ్లు నివసించేటందుకు మూర్ఖులు ఇళ్లు నిర్మిస్తారు" అనే సామెతను నిరూపించాడు.

అంతా సెటిల్ అయ్యారు.

కానీ అంబుజానికి మాత్రం ఒక చిన్న అనుమానం మెదడులో మెదలుతో... తొలుస్తూ తుట్టతుదకు పెనుభూతమై.. ఉండబట్టలేక.. చారిని అడిగింది.

"ఏమండీ! చాలా కాలం నుండి మిమ్మల్ని ఒక్కటి అడగా లనుకుంటున్నాను. మనము తమిళులం, అల్లుడూ వాళ్లు... తెలుగువాళ్లు అని పెళ్లికి సమ్మతించలేదు. కాబట్టి పెళ్లికి వెళ్లలేదని సరిపెట్టుకున్నా. ఆమె పంపిన డబ్బును ముందు వెనకా ఆలోచించకుండా నిర్మొహమాటంగా పుచ్చుకున్నారు.

'ఆ డబ్బుతోనే ప్లాటు కొన్నారు... ఇల్లు కట్టారు.. ఇప్పుడా ఇంట్లోనే ఉంటున్నాము గదా. మరి నాకు తెలియక అడుగుతా... మన మా పెళ్లికి ముందుగా అంగీకరించి ఉండి ఉంటే... మనకు కాస్త మర్యాదైనా దక్కేదేమో?"

"మర్యాద దక్కి ఉండేదేమోగాని డబ్బు దక్కేదే కాదు. వెర్రి మొగమా..."

"అంటే?"

"పెళ్లికి ఒప్పుకుని ఉంటే మనము పెళ్లి చేయాల్సి వచ్చేది. అంటే 'కరువులో అధికమాసం. వియ్యంకుని హోదాకు తగ్గట్టు... 25,000 రూపాయలైనా కనీసం పెళ్లి ఖర్చు అయ్యేది. ఈ అనవసరపు ఖర్చును పెళ్లికి ఒప్పుకోకుండా తప్పించాను. పెళ్లయిన తక్షణమే రాజీపడిపోయి మన పెద్దరికాన్ని నిలుపుకున్నాను. అమ్మాయి పంపిన డబ్బుతో ప్లాటు కొనడం.. ఇల్లు కట్టడం.. ఆ ఇంట్లోనే నివసించడం.. అంతా ఆ పెద్దరికం లీలలోని భాగమే. తెలిసిందా?"

అంబుజం ఆశ్చర్యంగా "ఇంత తెలివితేటలు మీ కెక్కడివండీ?"

చారిమెల్లగా "అది మనవి కావే... మన లక్ష్మి తెలివితేటలే."

"!!!!!"

"ఆ రోజు టాజ్ మహల్‌లో కనిపించి లక్ష్మి 'నాన్నా! ఈ పెళ్లికి ససేమిరా ఒప్పుకోవద్దు' అని ఖచ్చితంగా చెప్పింది. తర్వాత జరిగినవన్నీ అంటే.... పెళ్లయిన తక్షణమే నేను రాజీకావడం... ఆమె డబ్బు పంపడం.. వగైరా వగైరా ఆమె పథకం ప్రకారమే.. అంతా ఆ 'లక్ష్మి' లీలలే సుమా... నేను నిమిత్తమాత్రుడనే" అని కర్మ వైరాగ్యాన్ని ప్రదర్శించి కొంతసేపటికి...

"కాని నా కిప్పుడు ఇంకో దిగులు పట్టుకుందే అంబుజం."

"దిగులా?"

"అవునే... మిగతా పిల్లలకి లక్ష్మికి ఉండే అపాటి తెలివితేటలుంటే బాగుండును."

చారి లౌక్యానికి విస్తుపోయి.. అంబుజం నోరు తెరిచి అలాగే దిష్టిబొమ్మలాగ ఉండిపోయింది. ఆమె కళ్లముందు

**"పెళ్లి చేసి చూడు**
**ఇల్లుకట్టి చూడు"**

అనే సామెత బూజుపట్టిన సామెతగా కనిపించి.. మరుక్షణమే అదృశ్యమై ఆ స్థానంలో తళుక్కున.

**"పెళ్లి చేయకుండా చూస్తూ ఉండు**
**ఇల్లు కట్టిస్తే దాంట్లోనే ఉండు."**

అనే ఆధునిక సామెత కలిగిన ఒక బోర్డు... దాన్ని తన మెడకు తగిలించుకున్న చారి మహాశయుడు..ఆనందోత్సాహాలతో ఆడపిల్లల తండ్రులకు మార్గదర్శకుడుగా ఆ సామెతలోని భావాన్ని ప్రపంచానికి చాటుతూ నినాదాలు చేస్తున్నట్టు కనిపించాడు.

చారి లాంటి తండ్రులు వర్ధిల్లాలి!

●

## అతి పెద్ద చెత్తకుప్ప

ఫ్రాన్స్‌కు చెందిన బ్రెస్ట్ అనే నగరంలో అరవై ఎనిమిది సంవత్సరాల వయసు గల మహిళ 18 సంవత్సరాలపాటు తన ఇంట్లోనే చెత్తను వేసుకుని 15 టన్నుల చెత్తకుప్పను తయారుచేసింది. ఇంతకాలం నిల్వ ఉన్న కారణంగా ఈ చెత్తకుప్పనుండి వచ్చే దుర్గంధాన్ని భరించలేక ఇరుగు పొరుగు వారు హెల్త్ డిపార్ట్‌మెంట్‌కి ఫోన్ చేస్తే, ఎనిమిది గదులు ఉన్న ఆ ఇంట్లో 17 అడుగుల ఎత్తున పేరుకుపోయిన ఆ చెత్తకుప్పను చూసి బిత్తరపోయారు. ఇంత దుర్గంధాన్ని భరిస్తూ ఆ మహాతల్లి ఆ కొంపలో ఎలా నివసిస్తోందా అని ఆరా తీయగా, 20 సంవత్సరాల క్రితం ఆ వృద్ధురాలి భర్త మరణించిన కారణంగా ఆమెలో ఓ విధమైన తీవ్ర డిప్రెషన్ ఏర్పడి ఇలా ప్రవర్తించిందట!

పి.వి. రమణకుమార్
[చిలకలూరిపేట]

## దంతధావనం - బొగ్గు

పల్లెల్లోను పట్టణాల్లోను, 'పళ్లు' తెల్లగా రావాలనే ఉద్దేశ్యంతో బొగ్గు పొడితో పళ్లు తోముకోవడం వల్ల, పళ్లు తెల్లబడవచ్చును గాని, త్వరగా అరిగి పోతాయి. అమూల్యమయిన పింగాణీ పొర [ఎనామిల్] అరిగి పోయి నొప్పిని కలిగించే నరాలు బయటపడతాయి.

ఇలాంటి పళ్లకు చల్లగాలి తగిలినా, చల్లని నీరు తగిలినా జివ్వుమని లాగుతాయి. ఆహారం తినలేని పరిస్థితి ఏర్పడుతుంది. అందుచేత బొగ్గు గాని, ఇతర గరుకు పొడులు గాని, పళ్లు తోముకోవడానికి ఉపయోగించకూడదు. వీటి వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువ



## అందరికీ కట్టుడు పళ్లు!

కేవలం వృద్ధులే కాకుండా, అవసరాన్ని బట్టి ఒక్కోసారి యువతీ - యువకులు కూడా కట్టుడు పళ్లు ఉపయోగించవలసి ఉంటుంది. వీటిని ఉపయోగించక పోవడం వల్ల కొన్ని అనర్థాలు దాపురిస్తాయి.

కోల్పోయిన పంటికి ప్రత్యామ్నాయంగా కట్టుడు పన్ను పెట్టుకోని వారిలో మాట స్పష్టత తగ్గుతుంది. నమిలే / కొరికే శక్తిని కోల్పోతారు. ఇరు ప్రక్కల దంతాలు స్థానభ్రంశం చెంది ఆ పైన కదిలి రాలిపోయే ప్రమాదం ఉంది. పళ్లు లేకపోవడం వల్ల, దంత సౌందర్యానికి లోటు ఏర్పడుతుంది. అందుచేత వృద్ధులైనా యువకులైనా పురుషులయినా, స్త్రీలయినా, పన్నును లేక పళ్లను కోల్పోయినపుడు దంత వైద్యుల సలహా మేరకు సాధ్యమయినంత త్వరలో కట్టుడు పళ్లు పెట్టించుకోవాలి.

డా. కె.ఎల్.వి. ప్రసాద్, మహబూబాబాద్